ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట
5
గురువారం 29 ఫిబ్రవరి 2024



తొలిరోజు ప్రశాంతం

- ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు
- మొదటిరోజు 711 మంది గైర్హాజరు
- ఆలస్యంగా వచ్చిన నలుగురికి నో ఎంట్రీ
- పలు సెంటర్లను సందర్శించిన సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 28 : జిల్లాలో బుధవారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు 10,328 విద్యార్థులు హాజరయ్యారు. 711 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తంగా 94శాతం హాజరు నమోదైంది. సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు, హుస్నాబాద్‌లో మరో ఇద్దరు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో లోనికి అనుమతించలేదు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు, అధికారులు చర్యలు చేపట్టారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ జిల్లా కేంద్రంలోని పలు సెంటర్లను సందర్శించి అధికారులకు సూచనలు చేశారు.


సిద్దిపేటలోని ఓ సెంటర్ వద్ద హాల్ టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు


పరీక్షా కేంద్రం వద్ద సీపీ అనురాధ


సిద్దిపేటలో సెంటర్‌కు ఆలస్యంగా వచ్చిన విద్యార్థి




సిద్దిపేటలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు


చిన్నకోడూరులో పరీక్ష సమయం దగ్గర పడడంతో పరుగెత్తుతున్న విద్యార్థిని


పరీక్షా కేంద్రం వద్ద తనిఖీ చేస్తున్న సిబ్బంది


చంటి పిల్లతో పరీక్షా కేంద్రానికి వస్తున్న అభ్యర్థి


చిగురిస్తున్న ఆశలు

- జిల్లాలో 14 మార్కెట్ కమిటీల రిజర్వేషన్లు ఖరారు
- జోరుగా ఆశావహుల ప్రయత్నాలు

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 28 : సిద్దిపేట జిల్లాలో వ్యవసాయ మార్కెట్లకు పాత కమిటీలు రద్దు చేసి నూతన కమిటీల ఏర్పాటుకు రిజర్వేషన్లను ప్రకటించడంతో పలువురిలో ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ మార్కెట్లకు పాలక వర్గాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. మంత్రి ఆదేశాలతో సంబంధిత శాఖాధికారులు రిజర్వేషన్లను ఖరారు చేశారు. నూతన కమిటీల పదవీకాలం రెండు సంవత్సరాలతో పాటు ఆరునెలల చొప్పున రెండుసార్లు పదవీకాలాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. స్థానిక ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జి మంత్రులు సిఫార్సు చేసిన వారిని నియమించే అవకాశం ఉండడంతో ఆశావహులు మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మార్చిలో లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున జిల్లాలో మొదటగా ఒకటి, రెండు వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

కమిటీలో 18 మంది సభ్యులు

కొత్తగా ఏర్పాటయ్యే మార్కెట్ కమిటీ కార్యవర్గంలో చైర్మన్, వైస్‌చైర్మన్‌తో కలిపి 18 మంది సభ్యులు ఉంటారు. ఇందులో మార్కెట్ కమిటీ పరిధిలో ఉండే రైతులే ఉండాల్సి ఉంటుంది. వ్యవసాయ అనుబంధ రంగాల నుంచి కనీసం ఐదుగురు సభ్యులు ఉండాలి. వీరిలో ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ, మహిళలు ఉండాలి. మార్కెట్ పరిధిలో లైసెన్స్ పొందిన వ్యాపారులు ఇద్దరు, సహకార సంఘాల నుంచి ఒకరు, జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి, వ్యవసాయంతో పాటు అనుబంధశాఖాధికారి ఒకరు, మార్కెట్ పరిధిలోని గ్రామ సర్పంచ్ లేదా మున్సిపల్ చైర్మన్‌లలో ఒకరు సభ్యులుగా ఉంటారు. పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి స్థానిక ఎమ్మెల్యే లేదా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో మార్కెటింగ్ శాఖకు పంపిస్తారు. 12 మంది రైతుల్లో చైర్మన్, వైస్ చైర్మన్లు ఉండాలి.





సిద్దిపేట వ్యవసాయ మార్కెట్

ఎవరి ప్రయత్నాల్లో వారు..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా మార్కెట్ కమిటీ ఏర్పాటుకు రిజర్వేషన్ ఖరారు కావడంతో ఆశావహులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎవరికి వారే తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

రిజర్వేషన్ ఇలా..

మార్కెట్ కమిటీల ఏర్పాటుకు రిజర్వేషన్ ఖరారు కావడంతో జిల్లాలో ఉన్న 14 వ్యవసాయ మార్కెట్ కమిటీలు, వాటి వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట ఓసీ మహిళ, చిన్నకోడూరు ఓసీ , గజ్వేల్ ఓసీ, హుస్నాబాద్ ఓసీ, నంగునూర్ ఓసీ, తొగుట ఓసీ, దౌల్తాబాద్ ఓసీ, కొండపాక ఓసీ, మిరుదొడ్డి ఓసీ మహిళ , దుబ్బాక ఓసీ, బెజ్జంకి ఓసీ, కోహెడ ఎస్సీ మహిళ, వంటిమామిడి ఎస్సీ మహిళ, చేర్యాల బీసీ మహిళ

పలువురు సీఐల బదిలీ

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 28 : సిద్దిపేట పోలీస్ కమిషనర్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ బుధవారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న కృష్ణారెడ్డి రామగుండానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మల్టీజోన్ -1 ఐజీ ఆఫీసులో సీఐగా పనిచేస్తున్న లక్ష్మణ్‌బాబు రానున్నారు. సీసీఎస్-1లో సీఐగా విధులు నిర్వహిస్తున్న డి.మధు మధిర టౌన్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. సీఎస్ బీ-1లో సీఐగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణరెడ్డి మల్టీజోన్-1 ఐజీ ఆఫీసుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హుస్నాబాద్ సర్కిల్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న కిరణ్ బదిలీపై రానున్నారు. పీసీఆర్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్.శివకుమార్ వరంగల్‌కు బదిలీ అయ్యారు. ఏసీబీలో సీఐగా పనిచేస్తున్న కొంద్రు శ్రీనివాస్ హుస్నాబాద్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు.

పోలీస్ కమిషనరేట్‌కు
రెండు కొత్త జాగిలాలు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 28 : సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌కు రానా, సిరి అనే కొత్త జాగిలాలను కేటాయించారు. ఈ జాగిలాలు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని కేంద్రంలో శిక్షణ ముగించుకుని సిద్దిపేట జిల్లాకు వచ్చాయి. డాగ్ స్క్వాడ్ సిబ్బంది జాగిలాలను పోలీస్ కమిషనర్ అనురాధ ఎదుట హాజరుపరిచారు. సీపీ జాగిలాలను పరిశీలించి వాటి శిక్షణ, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాగిలాలు నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ రామచంద్రరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్, ఆర్ఎస్ఐ రోహిత్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది భాను, నవీన్, వెంకటేష్, శ్రావణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌కు కేటాయించిన కొత్త జాగిలాలు

అట్టహాసంగా అక్షయపాత్ర వార్షికోత్సవం

- హాజరైన సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ ఎన్వీ రమణ

కంది, ఫిబ్రవరి 28 : అక్షయపాత్ర 15వ వార్షికోత్సవాల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా కంది పరిధిలో ఉన్న అక్షయపాత్ర వంటశాల వద్ద బుధవారం నరిష్ ద చేంజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ ఎన్వీ రమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇక్కడి వంటశాలలో రెండు ఆటోమెటెడ్ యంత్రాలను ప్రారంభించి, వంటలు వండే, కూరగాయలు కడిగే యంత్రాలను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్షయపాత్ర ఫౌండేషన్ సేవలు అభినందనీయం అన్నారు. విద్యార్థుల్ని శక్తిమంతులుగా తయారు చేయడానికి పౌష్టికాహారం తప్పనిసరి అన్నారు. ఏ విద్యార్థి కూడా ఆకలితో బాధపడొద్దనే లక్ష్యంతో అక్షయపాత్ర భోజనం అందిస్తుందని వెల్లడించారు. ఎందరో పేద విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్న అక్షయపాత్రకు దాతలు సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల్లో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జస్టిస్ ఎన్వీ రమణ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అక్షయపాత్ర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మధు పండిత దాస, ప్రాంతీయ అధ్యక్షుడు సత్య గౌర చంద్రదాస, వివిధ సంస్థలకు చెందిన దాతలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


కందిలోని అక్షయయపాత్ర వంటశాలలో కూరగాయలను శుభ్రం చేసే యంత్రాలను పరిశీలిస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ

రాష్ట్రం నుంచి ఢిల్లీకి సూట్ కేసులు

- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

జహీరాబాద్, ఫిబ్రవరి 28 : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ముఠా హైదరాబాద్‌లో వసూళ్లకు తెగబడుతున్నారని జహీరాబాద్ పట్టణంలో బుధవారం రాత్రి నిర్వహించిన బీజేపీ విజయసంకల్ప యాత్రలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఘాటైన విమర్శలు చేశారు. ఎన్నికల కోసం డబ్బును సమకూర్చుకునే పనుల్లోనే కాంగ్రెస్ ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అవినీతి, అక్రమాలకు తెరలేపుతూ ఢిల్లీకి సూట్‌కేస్‌లను పంపిస్తుందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండు రెండేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 90 రోజులు కావస్తున్నా ప్రజలకు ఏం కావాలి, ఏం చేస్తే బాగుందనే విషయాన్ని పక్కన బెట్టి కాళేశ్వరం, సుందిళ్ల మేడిగడ్డ తదితర ప్రాజెక్టులపై విమర్శలు, ప్రతి విమర్శలు, ఆరోపణలు చేస్తూ కాలం వృథా చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోనే ప్రజలకు అవినీతిరహిత, సమర్థవంతమైన పాలన అందుతుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గడిచిన పదేళ్లలో ఏళ్లలో బీజేపీ హయాంలో సుస్థిరమైన పాలనను అందించామన్నారు. ప్రజలు మళ్లీ ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని, ప్రజాదరణ తీరును చూస్తే మరోమారు మోదీ ప్రధానమంత్రి అవడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్‌పట్ల ప్రజల్లో నమ్మకం కొరవడిందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ దేశవ్యాప్తంగా 40 సీట్లను కూడా సాధించడం కష్టమేనన్నారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే ప్రజలకు లాభంలేదని, తెలంగాణలో బీఆర్ఎస్ అవసరమే లేదన్నారు. రైతాంగ, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతిని, నిరుపేదల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. విధానపరమైన, సాహసోపేతమైన నిర్ణయాలతో సమర్థవంతమైన పాలన అందాలంటే నరేంద్రమోదీకే సాధ్యమవుతుందన్నారు. ట్రిబుల్ తలాక్ చట్టాని రద్దుచేసి ఎందరో ముస్లిం మహిళల జీవితాలను మోదీ కాపాడరని గుర్తుచేశారు. కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి పాల్గొన్నారు.

మూడు కుటుంబాల్లో
విషాదం

- బైకును ఢీ కొట్టిన కారు
- ముగ్గురు మృతి.. ఎనిమిది మందికి తీవ్రగాయాలు


నుజ్జునుజ్జయిన కారు




గాయపడిన చిన్నారులు

సిద్దిపేటక్రైం/ నంగునూరు, ఫిబ్రవరి28: నంగునూరు మండలం రాంపూర్ శివారులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదం మూడు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. ఓ కుటుంబం వివాహ వేడుకలకు హాజరై తిరుగు పయనమయ్యింది. ఇంకా కొద్ది దూరం ప్రయాణిస్తే ఇంటికి చేరుతామనే క్రమంలో వారి కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టి, పక్కనున్న కాలువలో పడిపోయింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న నంగునూరు మండలం బద్దిపడగకు చెందిన కట్ట రవి(55), నాగరాజుపల్లికి చెందిన ముక్కెర ఐలయ్య(60) మృత్యువాతపడ్డారు. వ్యవసాయం చేసుకునే వీరు ఇద్దరు తోడళ్లులు.


సంఘటనా స్థలంలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఇద్దరూ పొలమాకులకు వెళ్లి బద్దిపడగకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నది.. రవికి భార్య ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఐలయ్యకు భార్య, ఒక కొడుకు, కుమార్తె ఉన్నారు. రెండు కుటుంబాలకు చెందిన ఇంటి పెద్దలు ఒకేప్రమాదంలో కన్నుమూయడంతో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగారు. ఇక, ప్రమాదానికి గురైన కారు నుజ్జునుజ్జయ్యింది. కారు ప్రయాణిస్తున్న వారిలో మమత (28) మృతి చెందింది. జక్కుల అనిల్ ఆయన కుమారుడు భానుప్రకాష్, కుమార్తె వైష్ణవి, రాంపల్లి గ్రామానికి చెందిన బాబురాజు, భార్య రేఖ, ఆయన కొడుకులు చరణ్, ప్రణయ్, అనిల్ అన్న కూతురు నాన్సీలకు తీవ్ర గాయాలుయ్యాయి. ప్రమాదంలో గాయపడిన వారిలో ఐదుగురు పదేళ్లలోపు పిల్లలు.. అందులో ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.






క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

అంతర్జాతీయ టైలర్స్ డే

చేగుంట, ఫిబ్రవరి 28: చేగుంటలో బుధవారం అంతర్జాతీయ టైలర్స్ డేను టైలర్ అసోసియేషన్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ నుంచి గాంధీ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. మెదక్ రోడ్డు వద్ద జెండాను ఎగురవేశారు. కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఎంపీపీ మాసుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, టైలర్ అసోసియేషన్ సభ్యులు భోగరాజు, ముత్యాలు, వేణు, శ్రీను, సాయిబాబా, రవి, నర్సింహులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో చోరీ


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మాసాయిపేట, ఫిబ్రవరి 28: మండల కేంద్రమైన మాసాయిపేటలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఆలయంలోని అమ్మవారి రెండున్నర కిలోల వెండి కిరీటం, వెండి ఆభరణాలు, అమ్మవారి ముక్కు పుడకతో సహా ఆలయంలో బిగించిన సీసీ కెమెరాల పరికరాలు సైతం దొంగలు ఎత్తుకెళ్లినట్లు గౌడ సంఘం నాయకులు సత్యగౌడ్, సిద్ధిరాములుగౌడ్, లక్ష్మణ్‌గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి, రామాయంపేట సీఐ వెంకటేష్ సందర్శించారు. చేగుంట ఎస్ఐ బాలరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరి సాగులో రైతులు సస్యరక్షణ చేపట్టాలి: శివప్రసాద్

చిన్నకోడూరు, ఫిబ్రవరి 28: వరి సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్ అన్నారు. బుధవారం చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో రైతులు సాగుచేసిన వరి పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని, సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. కాండం తొలిచే పురుగును గమనించడానికి దీపపు ఎర, సోలార్ దీపపు ఎర, లింగాకర్షక బుట్టలను అమర్చుకొని రెక్కల పురుగుపై నిఘా పెట్టాలన్నారు. పిలక దశలో ఎకరాకు మూడు లింగాకర్షక బుట్టలు పెట్టి అందులో వారానికి బుట్టకు 25 నుంచి 30 పురుగులు పడినప్పుడు తప్పనిసరిగా సస్యరక్షణ చేపట్టాలని సూచించారు. ఏవో జయంత్ కుమార్, ఏఈవోలు ప్రవీణ్, జమీల్, రైతులు పాల్గొన్నారు.


చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో ఆన్‌లైన్‌లో నమోదైన క్రాప్ బుకింగ్ వివరాలను పరిశీలిస్తున్న డీఏవో శివ ప్రసాద్

దుబ్బాకలో ఘనంగా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

దుబ్బాక, ఫిబ్రవరి 28: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఆర్థిక అక్షరాస్యత సలహాదారుడు దయాకర్ అన్నారు. బుధవారం దుబ్బాకలోని కేసీఆర్ పాఠశాలలో ఆర్‌బీఐ ఆదేశాల మేరకు 2024 ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను పురస్కరించుకుని వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చిన్నమొత్తాల పొదుపు, సైబర్ నేరాలపై, బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించారు. దుబ్బాక డీసీసీబీ సూపర్‌వైజర్ అశోక్‌శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కేసీఆర్ పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న దయాకర్

మల్లన్న భక్తులకు అందని

అభిషేకం లడ్డూ

- టెండర్ నిబంధనలు బేఖాతరు
- 100 గ్రాముల పరిమాణం గల లడ్డూ తయారీకి కిలోకు రూ.38
- 400 గ్రాముల అభిషేక లడ్డూ తయారీకి కిలోకు 1పైసా చొప్పున టెండర్
- లేబర్ చార్జీల చెల్లింపులో భారీ వ్యత్యాసంతో విముఖం
- ఆలయాధికారుల మౌనం

చేర్యాల, ఫిబ్రవరి 28: కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనార్థం వచ్చే భక్తులతో పాటు ఆర్జితసేవలు నిర్వహించిన వారికి అందించే అభిషేకం లడ్డూ ప్రసాదం కరువవుతున్నది. అభిషేకం లడ్డూలు అందుబాటులో ఉండేలా చూడాలని దేవాదాయశాఖ ఉన్నతాధికారులు గతంలో ఆదేశాలిచ్చినా ఇక్కడ మాత్రం తుంగలో తొక్కుతున్నారు. ఆలయాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం వలన టెండర్ దారుడికి కలిసి వస్తుండమే కాకుండా ఆలయానికి అనవసర భారం మోపుతున్నారు. సాధారణంగా విక్రయించే 100 గ్రాముల పరిమాణం లడ్డూకు, 400 గ్రాముల పరిమాణం గల అభిషేకం లడ్డూ తయారీకి చెల్లించే లేబర్ చార్జీలలో భారీ వ్యత్యాసం ఉండటంతో కాంట్రాక్టర్ విముఖంగా వ్యవహరిస్తున్నారు.

గతంలో ఆలయం ఆధ్వర్యంలోనే లడ్డూ ప్రసాదం తయారు చేసేవారు. కానీ నిర్వహణ భారంగా మారడంతో కొన్నాళ్లుగా ముడి సరుకులిచ్చి తయారు చేయిస్తున్నారు. అందుకు టెండర్లు నిర్వహించి లేబర్ చార్జీలు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో కాంట్రాక్టర్లు తక్కువ లేబర్ చార్జీ ధరకు అభిషేకం లడ్డూను, ఎక్కువ ధరకు సాధారణ లడ్డూ తయారీ చేయించి ఇస్తామని టెండర్ పొందినప్పటికీ ఏమాత్రం గిట్టుబాటు కాదన్న కారణంగా అభిషేకం లడ్డూను విస్మరించి వాటిస్థానంలో సాధారణ లడ్డూలు అందిస్తూ టెండర్ నిబంధనలు బేఖాతర్ చేస్తున్నారు. తద్వారా భక్తులకు అభిషేకం లడ్డూ అందుబాటులో ఉండకపోవడంతో ఉసూరుమంటున్నారు.

వీఐపీ దర్శనం, అభిషేకం, కల్యాణం చేసిన భక్తులకు లడ్డూ

మల్లన్న నిత్య కల్యాణంలో పాల్గొన్నవారితో పాటు అభిషేకం చేస్తున్న భక్తులు రూ.900 చెల్లించి టికెట్ తీసుకుంటున్నందుకు ఆలయవర్గాలు ఆశీర్వాద పూర్వకంగా ఓం నమఃశ్శివాయ జరీ షల్లా, రెండు జాకెట్ పీసులతో పాటు 400 గ్రాముల అభిషేకం లడ్డూ ప్రసాదం అందించాల్సి ఉన్నది. రూ.500 చెల్లించి వీవీ ఐపీ ప్రత్యేక దర్శన టికెట్ తీసుకున్న వారికి ఉచితంగా అభిషేకం లడ్డూను అందజేయాల్సి ఉన్నది. గతంలో కొద్దిమంది మాత్రమే ఆర్జితసేవలు జరిపినా రానురాను సంఖ్య పెరుగుతూ వస్తున్నది.

ఒక్క పైసాకు బదులు రూ.38 చెల్లింపు

లడ్డూ రుచికరంగా ఉండేందుకు నాణ్యతలో రాజీపడకుండా దిట్టం నుంచి సమపాళ్లలో ముడిసరుకులు అందిస్తున్నారు. 1 కిలో శనగ పిండికి 2 కిలోల చక్కర, 650 గ్రాముల నెయ్యి, 50 గ్రాముల కాజు, 50 గ్రాముల కిస్‌మిస్, 50 గ్రాముల మిస్రీ, ఏడున్నర తులాల యాలకులు, తులంన్నర జాజికాయ, తులంన్నర పచ్చ కర్పూరం అందిస్తున్నారు. కిలో శనగ పిండి ప్రాతిపదికన 100 గ్రాముల లడ్డూలు 42, 400 గ్రాముల లడ్డూలు 11 తయారుచేసి ఇవ్వాలి. అందుకు 100 గ్రాముల లడ్డూను కిలోమేర తయారు చేయించి ఇచ్చినందుకు రూ.38, అలాగే 400 గ్రాముల పరిమాణం గల అభిషేకం లడ్డూ తయారీకి కేవలం ఒక్కపైసా చొప్పున చెల్లించాల్సి ఉన్నది. కానీ రెండు రకాల లడ్డూల తయారీ లేబర్ చార్జీలలో భారీగా తేడా ఉండటంతో టెండర్ దారుడు అభిషేకం లడ్డూలు విస్మరించి 400 గ్రాముల లడ్డూ బదులు 100 గ్రాముల పరిమాణం గల నాలుగు లడ్డూలు అందజేస్తున్నారు.

నిత్యం వేలాది లడ్డూల విక్రయం

మల్లన్న దర్శనార్థం సాధారణ రోజుల్లో నిత్యం 3-5 వేలు, ఆదివారం రోజున 10-15 వేల మంది వస్తున్నారు. అలాగే జాతర సమయంలో నిత్యం 5-10 మంది, ఆదివారాలలో 30-50 వేలమంది వస్తున్నారు. తద్వారా నిత్యం 2-4 వేలు, ఆదివారం 8-10 వేలు లడ్డూలు, జాతర కాలం సాధారణ రోజుల్లో నిత్యం 5-8 వేలు, ఆది వారాలలో 15-25 వేల లడ్డూలు విక్రయమవుతున్నాయి. అభిషేకం లడ్డూల స్థానంలో సాధారణ లడ్డూలు అందిస్తుండటంతోపాటు లేబర్ చార్జీలు పైసాకు బదులు రూ.38చొప్పున అడ్డగోలుగా చెల్లించాల్సి వస్తుండటంతో ఆలయానికి భారీ గండిపడుతున్నా ఆలయవర్గాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు.


మల్లన్న కల్యాణంలో పాల్గొన్న భక్తులు(ఫైల్)

చెల్లింపులపై దృష్టి పెడితే..

ఆర్జితసేవలు జరిపిన వారితో వీవీఐపీ దర్శన టికెట్లు తీసుకున్న వారెంతమంది.. వారికి ఎన్ని అభిషేకం లడ్డూల జారీచేశారన్న వివరాలు పొందుపరిచిన డీసీఆర్‌తో పాటు ప్రసాద తయారీదారుడికి చెల్లించే డబ్బుల వివరాలు పరిశీలిస్తే అసలు బాగోతం బయల్పడనున్నది. ఒక కిలోకు పైసా చెల్లించాల్సి ఉండగా, అభిషేకం లడ్డూ తయారు చేయకున్నా కిమ్మనకుండా వ్యవహరిస్తుండటం పట్ల అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయ ఆదాయ పరిరక్షణతో పాటు వనరులు పెంపొందిస్తున్నామని చెబుతున్న పునరుద్ధరణ కమిటీ అభిషేక లడ్డూ ప్రసాద విషయంలో జరుగుతున్న 'చెల్లింపు'ల పైనా దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.


ఆలయంలో తయారుచేస్తున్న లడ్డూ ప్రసాదం


400 గ్రాముల పరిమాణం గల అభిషేకం లడ్డూ


అభిషేకం లడ్డూకు బదులు అందిస్తున్న నాలుగు 100 గ్రాముల లడ్డూ ఉన్న కవర్లు

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- ఎక్కడా కనిపించని ఆట వస్తువులు
- అందుబాటులోకి తీసుకురావాలని క్రీడాకారుల వేడుకోలు


ఎన్సాన్‌పల్లిలోని క్రీడా ప్రాంగణం

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 28: గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం అందులో ఆట వస్తువులు లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. సిద్దిపేట అర్బన్ మండలంలో 12 గ్రామపంచాయతీలు ఉండగా 11 గ్రామపంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలను ప్రారంభించారు. ఫొటోల ఫోజుల కోసమో.. ఆట వస్తువులను పొందడం కోసమో.. తెలియదు కానీ.. ప్రాంగణాలు ప్రారంభించిన కొద్దిరోజులే ఆటలు నిర్వహిస్తున్నట్లు ఫొటోలతో సరిపెట్టారని విమర్శలు ఉన్నాయి. ఇప్పటివరకు గ్రామీణస్థాయిలో క్రీడా ప్రాంగణాలను ఏ స్థాయిలో ఉపయోగించుకున్నారు..? ఎంతమంది క్రీడాకారులను తయారు చేశారంటే శూన్యమే అని చెప్పాలి. కొన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలకు స్థలం కేటాయిస్తే.. మరికొన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో కొంత స్థలాన్ని కేటాయించారు.

క్రీడా సామగ్రి ఏమైనట్లు?

గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయడంతో పాటు ఒక్కో గ్రామపంచాయతీకి సుమారు రూ.లక్షకు పైగా విలువ చేసే క్రీడా సామగ్రిని గ్రామ ప్రజాప్రతినిధులకు, సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు అందజేసింది. క్రీడా ప్రాంగణాల ఉపయోగం లేకపోవడంతో.. ప్రస్తుతం ఆ క్రీడా సామగ్రి ఎక్కడుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలను, క్రీడా సామగ్రిని ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామీణస్థాయి క్రీడాకారులు కోరుతున్నారు.

రాజంపేట వాసికి గోల్డ్‌మెడల్

- గవర్నర్ చేతులమీదుగా అందుకున్న వినయ్‌కుమార్


గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకుంటున్న వినయ్‌కుమార్

నంగునూరు, ఫిబ్రవరి 28: పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ 16వ స్నాతకోత్సవం సందర్భంగా 2021-23 ఎంఏ పీజీ రంగస్థల కళల శాఖ (థియేటర్ ఆర్ట్స్) కోర్సు లో నంగునూరు మండలంలోని రాజంపేటకు చెందిన కాటం విజయ్‌కుమార్ గోల్డ్‌మెడల్ సాధించారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన చేతులమీదుగా వినయ్‌కుమార్ గోల్డ్ మెడల్‌తో పాటు సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ గవర్నర్ చేతులమీదుగా గోల్డ్ మెడల్ అందుకోవడం సంతోషంగా ఉన్నదని, భవిష్యత్‌లో ఈ ప్రోత్సాహంతో మరింత ఉన్నతమైన స్థానం కోసం కృషి చేస్తానని తెలిపారు. తనను ప్రోత్సహించి ముందుకు నడిపించిన హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్, డీన్ కోట్ల హనుమంతరావు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, అధ్యాపక బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాస్థాయి కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు


జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన మెదక్ జిల్లా జట్టు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 28: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని మాచవరంలో జిల్లాస్థాయి పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఎంపికే లక్ష్యంగా యువకులు కబడ్డీ కూత కూశారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జట్టుకు ఎంపిక చేశారు. జిల్లా జట్టులో రాకేష్, నిఖిల్, నర్సింహులు, నరేష్, సందీప్, శ్రీకాంత్, నగేష్, గణేష్, వెంకటేశం, తిరుపతి, కిరణ్ ఎంపికైనట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వచ్చేనెల 2 నుంచి 4 వరకు నాగార్జునసాగర్‌లో నిర్వహించే 70వ రాష్ట్రస్థాయి పురుషుల కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో నాగరాజు, అసోసియేషన్ సభ్యులు కుమార్, రవి, శశికుమార్, సాయిలు, శివ, ప్రభాకర్ పాల్గొన్నారు.

శ్రీభగలాముఖి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం


శ్రీభగలాముఖి అమ్మవారి ఉత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


శివ్వంపేట, ఫిబ్రవరి 28: మండల కేంద్రమైన శివ్వంపేటలోని శ్రీ భగలాముఖి అమ్మవారి ప్రథమ వార్షికోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు శ్రీమఠం లలిత త్రిపుర సుందరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ బ్రహ్మానంద సరస్వతి హాజరయ్యారు. మొదటిరోజు గణపతిపూజ, పుణ్యాహవచనము, మండప స్థాపన, పూర్వక పూజ, గోపుజ పల్లకీసేవ నిర్వహించారు. కాగా కుంకుమార్చనలో మహిళ భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రియాంక చేసిన భరతనాట్యం అందరినీ ఆకట్టుకున్నది. ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నీలం మధు, ట్రస్టు ప్రతినిధులు శివకుమార్‌గౌడ్, జడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా, పురుషోత్తంశర్మ, శ్రీనివాస్‌గౌడ్, పూజారి సంతోష్‌శర్మ, పబ్బ స్వరూపరమేష్‌గుప్తా దంపతులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు ప్రారంభం


ఉర్సులో భాగంగా ప్రార్థనలు చేస్తున్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 28: గజ్వేల్ పట్టణంలోని ప్రముఖ గ్యారాషహీద్ దర్గాలో ఉర్సు మంగళవారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమైంది. గజ్వేల్ పట్టణంలోని జామైమజీద్ నుంచి గ్యారషహీద్ దర్గా వరకు గంధం ఊరేగింపును నిర్వహించగా, ప్రజ్ఞాపూర్‌లోని ఆయా మజీద్‌ల నుంచి గంధం ఊరేగింపును నిర్వహించి దర్గాకు చేరుకున్నారు. గ్యారాషహీద్ దర్గాలో గంధం సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్ వారిచే ఖవ్వాలీని నిర్వహించారు. ఈ ఉర్సులో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పాల్గొన్నారు. వారితో ముతావలీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సయ్యద్ మతీన్, యూత్ కాంగ్రెస్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

వేలం పాట ఆదాయం రూ.2.95 లక్షలు


బహిరంగ టెండర్లు వేస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

నారాయణరావుపేట, ఫిబ్రవరి 28: బుగ్గరాజేశ్వరస్వామి ఆలయం దుకాణాల బహిరంగ వేలం పాటల ద్వారా ఆలయానికి రూ.2.95 లక్షల ఆదాయం వచ్చినట్లు దేవాదాయశాఖ సూపరింటెండెంట్ రంగారావు తెలిపారు. బుధవారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని బుగ్గరాజూశ్వరస్వామి ఆలయం వద్ద మహా శివరాత్రి సందర్భంగా దుకాణాలకు వేలం నిర్వహించారు. కొబ్బరికాయల దుకాణం, పులిహోర, లడ్డూ, పార్కింగ్ ఇతరత్రా వాటికి వేలం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీరాములు, దేవాదాయశాఖ ఈవో మోహన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ పొదిల కిషన్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు సంతోష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోనయ్యగారి ఎల్లయ్య, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన ట్రైడెంట్ వేలం ప్రక్రియ


ట్రైడెంట్ కర్మాగారం వేలం పాటకు ఏర్పాట్లు చేసిన అధికారులు

జహీరాబాద్, ఫిబ్రవరి 28: జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలో గల ట్రైడెంట్ చక్కెర కర్మాగారం వేలం ప్రక్రియ బుధవారం నిలిచిపోయింది. యాజమాన్యం చెరకు రైతులకు రూ.7.38 కోట్ల పెండింగ్ బిల్లులతోపాటు, కార్మికుల వేతనాలు రూ.2 కోట్లను కలుపుకుని మొత్తం 9.38 కోట్లు చెల్లించాల్సి ఉన్నదని చక్కెరశాఖ అధికారి రాజశేఖర్ తెలిపారు. అయితే కర్మాగారం పెండింగ్ బిల్లులు ఇవ్వడంలో మొండికేయడం మూలంగానే ఉన్నతాధికారుల ఆదేశాలతో రెవెన్యూ రికవరీ చట్టం కింద బుధవారం కర్మాగారాన్ని వేలం వేసేందుకు నిర్ణయించామన్నారు. అందులో భాగంగా రెవెన్యూ, చక్కెరశాఖ, తదితర శాఖలకు చెందిన అధికారులు కర్మాగారాన్ని వేలం వేసేందుకు వెళ్లారు. దీంతో వేలం పాటలో పాల్గొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు. స్థానికంగా కర్మాగారం వద్ద నెలకొన్న విషయాన్ని కలెక్టర్‌కు విన్నవిస్తామని రాజశేఖర్ తెలిపారు. ఇదిలా ఉండగా కర్మాగారానికి చెందిన ఓ డైరెక్టర్ మాత్రం మంగళవారం రాత్రి రైతుల ఖాతాల్లో సుమారు రూ.5 కోట్లు వేశారని, ఇంకా రూ.4.38 కోట్లు వేయాల్సి ఉన్నదన్నారు. కర్మాగారాన్ని మరోమారు వేలం వేసేందుకు తేదీలను ఖరారు చేస్తారా లేదా అనే విషయం ఉన్నతాధికారుల నిర్ణయాన్ని బట్టి ఉంటుందని ఆయన వివరించారు. ఈ వేలం పాటలో జహీరాబాద్ ఇన్‌చార్జి తహసీల్దార్ మల్లేష్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ వంశీ, ఆర్ఐ రుక్మోద్దీన్, వివిధశాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

కౌడిపల్లి, ఫిబ్రవరి 28: చెరువులో పడి వ్యక్తి మృతిచెందాడు. కౌడిపల్లి మండలం కొటాల గ్రామానికి చెందిన కొడకండ్ల ప్రభాకర్(50) భార్య సుశీలతో మంగళవారం ఉదయం 10 గంటలకు పొలం వద్దకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. రాత్రి 10 అవుతున్నా ఇంటికి రాకపోయే సరికి భార్య ఫోన్‌చేసింది. అయినా ఎత్తలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని చౌదరి చెరువు గట్టు వద్ద ప్రభాకర్ బట్టలు, చెప్పులు కనిపించాయి. గ్రామస్థులు ఉదయం 7 నుంచి 11 గంటల వరకు వెతకగా.. ప్రభాకర్ మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య సుశీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


సిద్ది పేట పట్టణంలోని అంబిటస్ పాఠశాలలో ప్రదర్శనలను చూపిస్తున్న విద్యార్థులు


సిద్దిపేటలోని శ్రీవాణి స్కూల్‌లో విద్యార్థులకు మెమెంటోను అందజేస్తున్న పాఠశాల డైరెక్టర్ సత్యం


హుస్నాబాద్‌లోని కేరళ ఇంగ్లిష్‌మీడియం స్కూల్‌లో విద్యార్థుల ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

సైన్స్‌తో సమాజాభివృద్ధికి బాటలు

జాతీయ సైన్స్‌దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్‌లలో విద్యార్థులు రూపొందించిన వినూత్న ప్రాజెక్టులు చూపరులను ఆకట్టుకున్నాయి. వారిలోని శాస్త్రీయ పరిజ్ఞానం ఆలోచింపజేశాయి. పలుచోట్ల విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. పలువురు మాట్లాడుతూ.. నిత్యజీవితంలో సైన్స్ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.


హుస్నాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి


కొండపాక: తిమ్మారెడ్డిపల్లిలో విద్యార్థుల ఎగ్జిబిట్‌లను పరిశీలిస్తున్న ఎంఈవో


అక్కన్నపేటలో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

హుస్నాబాద్/ హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 28 : సైన్స్ సమాజాభివృద్ధికి బాటలు వేస్తుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జాతీయ సైన్స్‌దినోత్సవాన్ని పురస్కరించుకుని హుస్నాబాద్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్‌దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి డీఈవో శ్రీనివాస్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వాసుదేవరెడ్డి, రంగానాయక్, ఎంఈఏ నర్సింహారెడ్డి, వి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని కేరళ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులు తయారు చేసిన సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించిన 50 రకాల ఎగ్జిబిట్స్ సందర్శకులను ఆకట్టుకున్నాయి. అదేవిధంగా హుస్నాబాద్‌లోని మాంటిస్సోరి కృష్ణవేణి టాలెంట్ హైస్కూల్‌లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భిక్షపతి, ప్రిన్సిపాల్ అబ్దుల్ మన్నన్, డైరెక్టర్లు కె రవీందర్, షాజు థామస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **అక్కన్నపేట:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన శాస్త్రీయ సాంకేతిక నమూనాలను ఎంపీడీవో బానోతు జయరాం పరిశీలించి విద్యార్థులను అభినందించారు.

● **సిద్దిపేట క్రైం:** సిద్దిపేట పట్టణం భారత్ నగర్‌లోని అంబిటస్ స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు వినూత్న ప్రాజెక్టులు, శాస్త్రీయ పరిజ్ఞానం ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పట్టణంలోని భారత్‌నగర్ శ్రీవాణి స్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు, సైన్స్ ఉపాధ్యాయులకు పాఠశాల డైరెక్టర్ సీహెచ్ సత్యం మెమెంటోను అందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కృపాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **నంగునూరు:** నంగునూరు ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు డి.రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **గజ్వేల్/గజ్వేల్ టౌన్:** విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యమని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కళాశాలలో మూడు రోజులుగా వివిధ రకాలైన కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. బుధవారం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర అధిపతి డాక్టర్ భవాని, జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రమేష్ బాబు, వృక్ష శాస్త్ర అధిపతి విజయభాస్కర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు పలు ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో 80రకాల సైన్స్ ప్రదర్శనలను విద్యార్థినులు ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పీవీ ఉమాశశి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఉమారాణి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సౌజన్య, డాక్టర్. జయరాజ్, డాక్టర్.సరోజ, అధ్యాపకులు పాల్గొన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ మెరీస్ విద్యానికేతన్ హైస్కూల్ ఎస్సెస్సీ, సీబీఎస్సీ విద్యార్థులు సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సెయింట్‌మెరీస్ విద్యానికేతన్ హైస్కూల్ ప్రిన్సిపాల్స్ కాటారాయప్ప, విజయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

● **దుబ్బాక/మిరుదొడ్డి:** దుబ్బాక మండలం రామక్కపేట గురుకుల, లచ్చపేట ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఇంపాక్ట్ ట్రైనర్ మోటివేషన్ స్పీకర్ సిద్దుల రవి సైన్స్‌పై అవగాహన కల్పించారు. అలాగే దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని ఆరెపల్లి, జంగపల్లి, మిరుదొడ్డి, రాజక్కపేట, చీకోడ్, చిట్టాపూర్, హబ్షీపూర్, దుంపలపల్లి గ్రామాలతోపాటు వివిధ గ్రామాల్లోని విద్యార్థులు వివిధ రకాల ప్రయోగాలను పాఠశాలల్లో ప్రదర్శించారు. ఎంఈవో ప్రభుదాస్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

● **మిరుదొడ్డి:** మిరుదొడ్డి మోడల్‌స్కూల్‌లో జిల్లా సైన్స్ ఆఫీసర్ శ్రీనివాస్ సర్ సీవీ రామన్‌చిత్రపటానికి పూలమాలను నేషనల్ సైన్స్‌డేను ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ఎగ్జిబిట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభుదాస్, ప్రిన్సిపాల్ భారతి, వెంకటరాజం తదితరులున్నారు.

● **ములుగు:** ములుగులోని స్వామి వివేకానంద విద్యాలయంలో సైన్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో ఉదయ భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. విద్యార్థుల ఎగ్జిబిట్స్‌ను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో ములుగు ఎస్‌ఐ విజయ్ కుమార్, పాఠశాల కరెస్పాండెంట్ ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు నాగరాణి, ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

● **రాయపోల్:** దౌల్తాబాద్ మండలం శేరిపల్లి బందారం మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో బుధవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. బాలికలు వివిధ ప్రదర్శనలు నిర్వహించగా ఉపాధ్యాయులు పరిశీలించి అభినందించారు.

● **కొండపాక:** కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో విద్యార్థులు తయారుచేసిన ఎగ్జిబిట్లను ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించి అభినందించారు. విద్యార్థులు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే మండలంలోని పలు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కాగా రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన సైన్స్ డే లో కుకునూరుపల్లి ఐటీఐ కళాశాల విద్యార్థులు పాల్గొని ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. దుద్దెడ గురుకుల పాఠశాలలో కొండపాక ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం జరిపారు. విద్యార్థులు పలు ఎగ్జిబిట్లను ప్రదర్శించారు.

● **నారాయణరావుపేట:** మండలంలోని ఆయా పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన నమునాలను ప్రదర్శించారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మండలం కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వడ్డెపల్లి నాగరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

వాగు మధ్యలో వేసిన బాట తొలగింపు


వాగులో బాట ఏర్పాటు చేసుకున్న ఇసుక వ్యాపారులు (ఫైల్)


వాగులో వేసిన మట్టిరోడ్డును తొలగిస్తున్న అధికారులు

మద్దూరు, ఫిబ్రవరి 28: దూళిమిట్ట మండలం జాలపల్లి గ్రామ వాగులో అక్రమంగా ఇసుక తరలింపునకు కొందరు మట్టిపోసి ఏర్పాటు చేసుకున్న బాటను బుధవారం రెవెన్యూ అధికారులు మద్దూరు పోలీసులతో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్‌అలీ మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలింపునకు పాల్పడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి వాగు మధ్యలో వేసిన మట్టి బాటను ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించినట్లు తెలిపారు.

ఆకస్మికంగా కాడెద్దుల మృతి

రాయపోల్, ఫిబ్రవరి 28: ఆకస్మికంగా కాడెద్దులు మృతి చెందిన సంఘటన దౌల్తాబాద్ మండలం అప్పాయపల్లిలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన ముత్తన్నగారి స్వామి తన రెండు కాడెద్దులను మంగళవారం సాయంత్రం పొలం వద్ద కట్టేశాడు. బుధవారం ఉదయం వెళ్లి చూసే సరికి ఒక ఎద్దు మృతి చెంది ఉంది. బుధవారం సాయంత్రం మరో ఎద్దు కూడా ఆకస్మికంగా మృతి చెందింది. దీంతో సుమారు 1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ఎద్దుల ఆకస్మిక మృతికి కారణాలు తెలియరాలేదు.

మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

కొండపాక, ఫిబ్రవరి 28: సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు, కొండపాక మండలం బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు అనంతుల నరేందర్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనకు పొన్నం కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నరేందర్‌తో పాటు కొండపాక మాజీ ఎంపీటీసీ లక్ష్మారెడ్డి లతోపాటు మరికొంతమంది పార్టీలో చేరారు. కార్యక్రమంలో కొండపాక, కుకునూరుపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాసరి లింగారావు, విరుపాక శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నరేందర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'బండి' దిష్టిబొమ్మ దహనం


వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొండపాక, ఫిబ్రవరి 28: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కొండపాక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎంపీ హోదాలో ఉన్న బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసరి లింగారావు విమర్శించారు. మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మంచాల చిన్న శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, అంకిరెడ్డిపల్లి గ్రామ అధ్యక్షుడు అంజయ్య, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి'

తొగుట, ఫిబ్రవరి 28: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని కాన్గల్ కోఆపరేటీవ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణరెడ్డి సూచించారు. బుధవారం తొగుట సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో తొగుట మార్కెట్ యార్డులో రెండు మూడు రోజుల్లో పొద్దుతిరుగుడు పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. ప్రభుత్వం కల్పించిన గిట్టుబాటు ధరకే రైతులు పంటను అమ్ముకొని లబ్ది పొందాలన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్ యాదగిరి, సీఈవో గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో అంతర్జాతీయ టైలర్స్ డే


గజ్వేల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దర్జీలు


గజ్వేల్, ఫిబ్రవరి 28: టైలర్ వృత్తి అపారమైనదని శాసనమండలి సభ్యులు డాక్టర వంటేరి యాదవరెడ్డి అన్నారు. పట్టణంలో బుధవారం అంతర్జాతీయ టైలర్స్ డే పురస్కరించుకొని మేర సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేరు సంఘం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేకు కట్ చేసిన అనంతరం అంగడిపేట హనుమాన్ ఆలయం నుంచి గజ్వేల్ ప్రధాన రోడ్డు మీదుగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ టైలర్ వృత్తి అపారమైందని, ఒక వ్యక్తి అందంగా కనిపించాలంటే వారి వస్త్రధారణ ముఖ్యమన్నారు. వస్త్రాలను అందంగా మలచి సమాజానికి సేవలు అందించే వృత్తి టైలర్స్ వృత్తి ఎంతో గొప్పదన్నారు. గజ్వేల్ నియోజకవర్గ మేరు సంఘం అధ్యక్షుడు రాయగిరి బిస్కిన్ బాబు, ఉపాధ్యక్షుడు దీకొండ బాలరాజు, సెక్రటరీ గూడూరి మల్లేశం, కోశాధికారి పొడిశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో ఘనంగా స్వయంపాలన


జగదేవ్‌పూర్ ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 28: మండల కేంద్రమైన జగదేవ్‌పూర్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. డీఈవోగా రాకేశ్, ఎంఈవోగా రామ్‌చరణ్, ప్రధానోపాధ్యాయులుగా భానుప్రసాద్ వ్యవహరించారు. అలాగే తొమ్మిదవ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించి ఘనంగా వీడ్కోలు పలికారు.


రాంసాగర్ ప్రాథమిక పాఠశాలలో..


రామసాగర్ పాఠశాలలో విద్యార్థులు

రాయపోల్, ఫిబ్రవరి 28: రాయపోల్ మండలం రాంసాగర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. డీఈవోగా దీక్షిత్, ఎంఈవోగా కరుణాకర్, హెచ్‌ఎంగా శ్రావ్య, విధులు నిర్వహించారు.

సాయి పబ్లిక్ స్కూల్లో ...

కొండపాక, ఫిబ్రవరి 26 : కొండపాకలోని సాయి పబ్లిక్ స్కూల్లో బుధవారం విద్యార్థులు స్వయం పాలనదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించారు, విద్యార్థులే ఉపాధ్యాయులుగా, సిబ్బందిగా వ్యవహరించి ప్రతిభ చూపారు.



స్వయంపాలనలో విద్యార్థులు

పరీక్షలలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి

ములుగు, ఫిబ్రవరి 28: ఇంటర్ జూనియర్ పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని, ఆ బాధ్యత ప్రిన్సిపాల్‌పై ఉందని గజ్వేల్ ఏసీపీ బాలాజీ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇంటర్ పరీక్షల సందర్భంగా జూనియర్ కాలేజీని సందర్శించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబందిత అధికారులపై ఉందని ఆయన తెలిపారు. ఆయన వెంట ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ ఏఎస్ఐలు అందాలు, కాలేజ్ కానిస్టేబుల్‌తో పాటు సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేడు దూళిమిట్టలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దూరు, ఫిబ్రవరి 28 : దూళిమిట్ట మండల కేంద్రంతో పాటు బెక్కల్, బైరాన్‌పల్లి సబ్ స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ముస్త్యాల నుంచి బెక్కల్‌కు వచ్చే పెద్ద లైన్‌లో విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరా యం ఉంటుందని, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేషన్ షాపుల్లో సమాచార బ్యానర్లు

మద్దూరు, ఫిబ్రవరి 28 : మద్దూరు, దూళిమిట్ట మండలాల్లోని అన్ని రేషన్‌షాపులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా అందిస్తున్న బియ్యం సమాచారాన్ని లబ్ధిదారులకు తెలిసేలా సివిల్ సప్లై అధికారులు సరఫరా చేసిన బ్యానర్లను అన్ని రేషన్ షాపులకు అందించినట్లు మద్దూరు ఉమ్మడి రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు ఎండీ కరీముద్దీన్ తెలిపారు. బుధవారం ఆయన మద్దూరులో విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన(పీఎం-జీకేఎవై) ద్వారా వన్ నేషన్-వన్ రేషన్ కార్డు పథకం కింద దేశంలోని ఏ రేషన్ దుకాణం నుంచైనా వచ్చే ఐదేళ్ల పాటు ప్రతి నెలా ఉచితం బియ్యం ప్రచారంతో పాటు తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా పేదలందరికీ వచ్చే ఐదేళ్లపాటు రేషన్ షాపుల ద్వారా ఉచిత బియ్యం అందించే సమాచార బ్యానర్లను అందించినట్లు తెలిపారు. నూతనంగా జారీ చేసిన ఆదేశాల మేరకు ఇక నుంచి ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపులు తెరచి ఉంచనున్నట్లు తెలిపారు. సమావేశంలో సెక్రటరీ డి. వేణుగోపాల్, ఎండీ హీలోర్ ఉన్నారు.

రేపు కొమురవెల్లిలో విజయసంకల్ప యాత్ర

చేర్యాల, ఫిబ్రవరి 28: భువనగిరి పార్లమెంట్ స్థానం పరిధిలోని కొమురవెల్లిలో మార్చి 1న విజయ సంకల్ప బస్సుయాత్ర చేపట్టనున్నట్లు బీజేపీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణి అన్నారు. ఈమేరకు బుధవారం కొమురవెల్లి మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె వివరా లు తెలిపారు.

ఓటమి భయంతో 'బండి'కి మతి భ్రమించింది

● మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నాయకులు


హుస్నాబాద్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి

హుస్నాబాద్, ఫిబ్రవరి 28 : ఓటమి భయంతోనే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజకీయాల్లో కుటుంబపరమైన విమర్శలు చేయడం చాలా బాధాకరమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే ఆయనకు బుద్ధి చెబుతారన్నారు.

దిగజారుడు వ్యాఖ్యలు సరికాదు

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై చేసిన దిగజారుడు వ్యాఖ్యలు సరికాదని టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి పేర్కొన్నారు. బుధవారం ఆయన హుస్నాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పొన్నం తల్లిని అవమానపరిచే విధంగా మాట్లాడటం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. పొన్నం తల్లి బతికుండగానే స్వర్గంలో ఉన్న వారి తల్లి ఆత్మ క్షోభిస్తుందని అనడం, అంతలోనే మళ్లీ వారి తండ్రి ఆత్మ క్షోభిస్తుందనడం చూస్తే సంజయ్‌కి మతి భ్రమించిందా? అనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. సమావేశంలో నాయకులు ఉన్నారు.

ఓటు బ్యాంకు కోసం అలాంటి మాటలా?

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విచక్షణ కోల్పోయి అత్యంత హేయంగా మాట్లాడుతున్నాడని జేఏసీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్ ఆరోపించారు. బుధవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ఓటు బ్యాంకు రాజకీయం కోసం దిగజారుడు మాటలు మాట్లాడుతున్నాడని ఆరోపించారు. పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి జన్మనిచ్చిన మాతృదేవతలను తీవ్రంగా అవమానించారని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్, నాయకులు తదితరులున్నారు.

హిందుత్వం అంటే ఇదేనా?

కోహెడ, ఫిబ్రవరి 28: హిందుత్వం అంటే అమ్మను అవమానించడమేనా అని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ని హుస్నాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీనవేని రాకేష్ ప్రశ్నించారు. బుధవారం కోహెడ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓట్ల కోసం సీట్ల కోసం అయితే ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు మానుకొని బహిరంగంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంతల శివారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జెరిపోతుల కుమారస్వామి, నాయకులు తదితరులున్నారు.

జంక్షన్లు, సీసీ రోడ్లను పరిశీలించిన కమిషనర్

గజ్వేల్, ఫిబ్రవరి 28: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు జంక్షన్ల అభివృద్ధి పనులను, సీసీ రోడ్ల పనులను మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య బుధవారం పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని 12, 18, 20 వార్డులలో సీసీ రోడ్లు, ముట్రాజ్‌పల్లి జంక్షన్ అభివృద్ధి పనులను ఏఈఈ కిష్టన్నతో కలసి పరిశీలించారు. రోడ్ల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. కాంట్రాక్టర్, అధికారులకు పలు సూచనలు చేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


బెజ్జంకి మార్కెట్ యార్డులో పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి, ఫిబ్రవరి 28 : రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు పొద్దుతిరుగుడు పంటను విక్రయించేందుకు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో మార్కెట్‌యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, జడ్పీటీసీ కవిత, పీఏసీఎస్ చైర్మన్ శరత్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పోచయ్య, పులి కృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కట్కూర్‌లో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

అక్కన్నపేట, ఫిబ్రవరి 28: నెల 6న ఆంధ్రజ్యోతిలో 'పొద్దు తిరిగింది..బతుకు మారింది..!' అనే కథనానికి అధికారులు స్పందించారు. అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామంలో పొద్దుతిరుగుడు గింజల కొనుగోలు కేంద్రాన్ని విశాల పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎంపీపీ మాలోతు లక్ష్మి, కట్కూర్, హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ పంజా రాజయ్య, బొలిశెట్టి శివయ్యలు కలిసి ప్రారంభించారు. కట్కూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని ఆంధ్రజ్యోతిలో కథనం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పత్రికకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షులు, అక్కన్నపేట ఎంపీటీసీ పెసరు సాంబరాజు, కట్కూరు ఎంపీటీసీ భూపతి సుదేష్ణ, మాజీ సర్పంచ్ జిల్లెల అశోక్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

'ఇంటర్' కేంద్రాల వద్ద 144 సెక్షన్

తొలిరోజు ఇంటర్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా సెంటర్ల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్‌ను అమలు చేశారు. సెంటర్ల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు.


హుస్నాబాద్‌లో విద్యార్థులను చెకింగ్ చేసి పరీక్ష హాల్‌లోకి పంపిస్తున్న ఇన్విజిలేటర్లు


నంగునూరు జూనియర్ కళాశాలలో బోర్డుపై హాల్ టికెట్ నంబర్లను పరిశీలిస్తున్న విద్యార్థులు

గజ్వేల్, ఫిబ్రవరి 28: గజ్వేల్ పట్టణంతో పాటు డివిజన్ వ్యాప్తంగా తొలిరోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. డివిజన్ పరిధిలోని ఆయా కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను గజ్వేల్ ఏసీపీ ఏ.బాలాజీ సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఐదుగురికి మించి గుమిగూడవద్దన్నారు. 500 మీటర్ల వరకు ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసి వేసి పోలీసులకు సహకరించాలని కోరారు. ఆయనవెంట గజ్వేల్ సీఐ సైదా ఉన్నారు.

● **హుస్నాబాద్:** హుస్నాబాద్ పట్టణంలో మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 719 మంది విద్యార్థులు పరీక్షలు హాజరుకావాల్సి ఉండగా 45 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సెంటర్‌లో ఇరువురు విద్యార్థులు పరీక్ష సమయానికి ఆలస్యంగా రావడంతో వారిని పరీక్ష హాల్‌లోకి అనుమతించలేదు. దీంతో వారు వెనుదిరిగి పోయారు.

● **దుబ్బాక:** దుబ్బాకలోని ప్రభుత్వ, వాగ్దేవి, ఎస్ఆర్ ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. మూడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 780మంది విద్యార్థులకు గాను 705మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 75మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే మిరుదొడ్డిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 295మంది విద్యార్థులకు గానూ 289మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. దుబ్బాక, మిరుదొడ్డి ఎస్ఐలు గంగరాజు, పరశురాములు పరీక్షాకేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

చిన్నకోడూరు: చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం (తెలుగు, హిందీ, సంస్కృతం) పరీక్షకు మొత్తం 185 మంది విద్యార్థులకు గాను, 183 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, ఇద్దరు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరిండెట్ రవి తెలిపారు.

● **తొగుట:** తొగుట మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 187 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 8 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. అదే విధంగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 80మంది విద్యార్థులకు గానూ మొత్తం మంది పరీక్షలకు హాజరైనట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ వెల్లడించారు.

● **చేర్యాల:** పట్టణంలోని గురుకుల కళాశాల కేంద్రంలో 335మందికి గానూ 285మంది హాజరు కాగా, 50మంది గైర్హాజరయ్యారు. ముస్త్యాల మోడల్‌స్కూల్ కేంద్రంలో 222మంది విద్యార్థులకు గానూ 197మంది హాజరయ్యారు.

● **నంగునూరు:** మండలంలోని నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, అక్కెనపల్లి మోడల్ స్కూల్, నర్మెట కస్తూర్బా పాఠశాల నుంచి 171 మంది విద్యార్థులకు గాను 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

● **మద్దూరు:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 114 మంది విద్యార్థులకు గానూ 109 మంది విద్యార్థులు హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ కోర్సుకు 12మంది విద్యార్థులకు గానూ 12 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎన్. శ్రీనివాస్ తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తుపై చేర్యాల సీఐ శ్రీను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

● **బెజ్జంకి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో మొత్తం 193 మంది విద్యార్థులకు గానూ 183 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. నిమిషం నిబంధనతో పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన ఓ విద్యార్థినిని పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించకపోవడంతో రోదిస్తూ వెనుతిరిగింది.